


లక్ష్యం దిశగా...

జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలకు 65శాతం మేర రుణాలు పంపిణీ చేయగా మిగతా లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక రూపొందించారు. 8లో



మిర్చి కొనుగోళ్లకు సన్నాహాలు

మిర్చి సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఖమ్మం మార్కెట్‌లో ఏర్పాట్లపై సమీక్షించారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చలి పెరగడమే కాక కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

భూభారతిపైనే ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొస్తున్న భూభారతితో రైతులకు కష్టాలు తొలగిపోతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ధరణి వెబ్‌సైట్‌లో పలువురు రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో పాత సైట్‌ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేకంగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. దీంతో సమస్యలు తొలగిపోవడమే కాక రైతుల భూములకు రక్షణ ఉంటుందని భావిస్తున్నారు. జిల్లాలో దాదాపు లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయి. 'ధరణి' తప్పుల తడకగా మారడంతో తమ భూములు కోల్పోతామనే ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. సాదాబైనామాకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఆ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండగా.. కొత్త చట్టంతో వీటికే కాక ఇతర సమస్యలకూ మోక్షం లభించనుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.

– ఖమ్మంసహకారనగర్





- భూసమస్యల పరిష్కారంపై నమ్మకంగా రైతులు
- జిల్లాలో లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్
- 'ధరణి'కి సంబంధించి ఇంకొన్ని దరఖాస్తులు కూడా..
- మార్గదర్శకాలు రాగానే ప్రక్రియ మొదలవుతుందన్న అధికారులు

వివిధ స్థాయిల్లో దరఖాస్తులు..

భూసంబంధిత సమస్యలపై జిల్లా రైతులు వెల్లువలా దరఖాస్తులు చేసుకున్నారు. మ్యుటేషన్, నాలా, పీపీబీ, అర్బన్ ల్యాండ్ తదితర అంశాలపై ధరణి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించారు. ఇవి తహసీల్దార్ వద్ద 1,949, ఆర్డీఓ వద్ద 989, అదనపు కలెక్టర్ వద్ద 764, కలెక్టర్ వద్ద 514 పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో పీపీబీ డేటా సవరణలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్డీఓ వద్ద డిజిటల్ సంతకంతో సర్వే నంబర్లు లేనివి, పేరులో మార్పులు, చేర్పులకు సంబంధించి అదనపు కలెక్టర్ వద్ద, సర్వే నంబర్లు లేనివి, నోషనల్ నుంచి పట్టా మార్పు, పట్టా భూమిలో కొంత మేర అమ్మినా పేరు మారకపోవడం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి. ఇక తండ్రి పేరులో తప్పుల సవరణ, లింగం నమోదులో సవరణ, ఆధార్ నంబర్ లేనివి తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సి ఉంది. ఇక కొన్ని సమస్యలను కలెక్టర్ స్థాయిలో, అక్కడ కాకపోతే సీసీఎల్ఏకు వెళ్లాల్సి వచ్చేది. కానీ భూభారతి చట్టం అమల్లోకి వస్తే ఆర్డీఓ స్థాయిలోనే 50 శాతానికిపైగా సమస్యలు పరిష్కారం అవుతాయని చెబుతుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాదాబైనామాలకూ మోక్షం

ఇక ఏళ్ల క్రితం సాదా కాగితాలపై రాసుకున్న అగ్రిమెంట్లకు సంబంధించి భూముల వివరాలను ఆన్‌లైన్‌లో చేసి పట్టాలు జారీచేసేందుకు ప్రభుత్వం గతంలో దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందుకు గాను జిల్లాలో 1,11,443 దరఖాస్తులు అందాయి. అయితే దీనిపై గత ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో పక్కన పెట్టేశారు. దీంతో రైతులకు నిరాశే మిగిలింది. అయితే కొత్తగా వస్తున్న భూభారతి చట్టంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు ప్రభుత్వం చెబుతుండడంతో రైతులకు ఊరట కలిగించే నిర్ణయంగా భావిస్తున్నారు. ధరణిలో పరిష్కారం కాని అనేక సమస్యలకు భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందనే ఆశతో రైతులున్నారు.

జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు..

సాదా బైనామా	1,11,443
ఇతర సమస్యలపై తహసీల్దార్ల వద్ద ఉన్నవి	1,949
ఆర్డీఓల వద్ద పెండింగ్	989
అదనపు కలెక్టర్ వద్ద..	764
కలెక్టర్ వద్ద..	514

భూమి ఉంది.. రికార్డుల్లో లేదు...

ఈ మహిళ పేరు మాలోతు సాద్వీ. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన ఈమెకు రఘునాథపాలెం మండలంలోని 81, 82 సర్వే నంబర్‌లో 2.14 ఎకరాల భూమి ఉంది. పట్టా కలిగిన ఈ భూమిని సాగు చేసుకుంటున్నా ఆన్‌లైన్ రికార్డుల్లోకి మాత్రం ఎక్కలేదు. పలుసార్లు దరఖాస్తు చేస్తే సర్వే కూడా చేశారు. అధికారులను అడిగితే ఈ సర్వే నంబర్ ఖాళీ లేదని చెబుతున్నారు. కొత్త చట్టం వస్తోందని స్థానికులు చెప్పడంతో ఇకనైనా సమస్య పరిష్కారమవుతుందని సాద్వీ నమ్మకం వ్యక్తం చేసింది.

పరిష్కారం చూపని ధరణి..

రైతులకు సంబంధించి అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని చెబుతూ గత ప్రభుత్వం 2020లో 'ధరణి' చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే సమస్యల పరిష్కారం ఏమో కానీ మరిన్ని కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. వీటిని పరిష్కరించేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నా ఎటూ తెగలేదు. వెబ్‌సైట్‌లో కొందరు రైతుల భూమి వివరాలు లేకపోవడం, ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదవడం వంటి సమస్యలను మొదట్లో ఎదురయ్యాయి. సాంకేతికపరంగా ఎదురైన కొన్ని అవాంతరాలను పరిష్కరిస్తుండగానే కొత్త సమస్యలు ఎదురయ్యాయి. ఇలా ఇప్పటివరకు కూడా రైతుల సమస్యలకు మోక్షం దొరకలేదు.

మార్గదర్శకాలు రాగానే ప్రక్రియ



రాష్ట్రప్రభుత్వం కొత్తగా భూభారతి కార్యక్రమాన్ని రూపొందించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారిస్తాం. రెవెన్యూకు సంబంధించి ఉన్న దరఖాస్తులన్నీ పరిష్కరించనున్నాం.

– పి.శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.31.84 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివా రి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి, ఈఓ కె.జగన్మోహన్‌రావు సమక్షాన లెక్కించగా 85 రోజులకు గాను రూ.31,84,525 ఆదాయం నమోదైంది. లెక్కింపులో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, సిబ్బందితో పాటు మధిర శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నాగపద్మజ



ఉద్యోగులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఈఓ

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా కె.నాగపద్మజ గురువారం విధుల్లో చేరారు. హన్మకొండ డీఆర్‌డీఏలో పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం బదిలీపై ఖమ్మంకు కేటాయించింది. ఈ సందర్భంగా ఆమె బాధ్యతలు స్వీకరించాక సీఈఓ దీక్షారైనాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత జిల్లా పరిషత్ ఉద్యోగులతో సమావేశమై అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై సమీక్షించారు.

ఎస్సెస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. మార్చి 21న మొదటి భాష, 22న ద్వితీయ భాష, 24న ఇంగ్లిష్, 26న గణితం పరీక్షలు ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇక 28న ఫిజికల్ సైన్స్, 29న జీవ శాస్త్రం పరీక్షలు ఉదయం 9–30నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే, ఏప్రిల్ 2న సాంఘిక శాస్త్రం ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, 3న ఒకేషనల్ కోర్స్ థియరీ పరీక్ష ఉదయం 9–30 గంటల నుంచి 11–30 గంటల వరకు జరగనుందని డీఈఓ తెలిపారు.

27, 28వ తేదీల్లో పాత పార్సిళ్ల వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో సెంటర్ నుంచి ఎవరూ తీసుకెళ్లని పార్సిళ్లను ఈనెల 27, 28వ తేదీల్లో వేలం వేయనున్నట్లు ఆర్టీసీ ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ వి.రామారావు తెలిపారు. ఇందులో ఎలక్ట్రికల్ సామగ్రి, ద్విచక్ర వాహనాల విడిభాగాలు, కంప్యూటర్ విడిభాగాలు, దుస్తులు, ఫెర్టిలైజర్స్, గృహోపకరణ వస్తువులు, టైర్లు మొదలైనవి ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 27, 28వ తేదీల్లో ఖమ్మం కొత్త బస్టాండ్ కార్గో సెంటర్ వద్ద జరిగే వేలంలో డిపాజిట్ లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ముదిగొండ: నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి సూచించారు. ముదిగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీ ఓపీ వివరాలు, ప్రసవాలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లే తేలితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ చందునాయక్, వైద్యాధికారి డాక్టర్ అరుణ, ఉద్యోగులు చంద్రప్రకాష్, సత్యవతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మధిర స్టేషన్‌లో పరిశీలించిన డీఆర్‌ఎం



స్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తేశ్‌కుమార్

మధిర: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన మధిర రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) భర్తేశ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు మ్యాప్‌ల ఆధారంగా పనుల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈమేరకు స్టేషన్‌లోని 1, 2వ నంబర్ ప్లాట్‌ఫారంలపై పర్యవేక్షించిన డీఆర్‌ఎం పనుల వివరాలు ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ సూచనలు చేశారు. రూ.25కోట్ల నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపించకుండా పర్యవేక్షించడంతో పాటు త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. అలాగే, మూడో లైన్ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. డీఆర్‌ఎం వెంట వివిధ విభాగాల రైల్వే అధికారులు ఉన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని పోలీసు కల్యాణమండపంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సునీల్‌దత్ కేక్ కట్ చేసి మాట్లాడారు. అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు నర్సయ్య, సాంబరాజు, శ్రీనివాసులు, ఆర్‌ఐలు కామరాజు, సాంబశివరావు, అప్పలనాయుడు, సీఐ హనూక్, సువార్తకులు సత్యకుమార్ పాల్గొన్నారు.

పాలనపై తహసీల్దార్లు పట్టు సాధించాలి

- ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయించండి
- సంక్రాంతి నాటికి ధరణి దరఖాస్తులు పరిష్కారం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: మండలంలో పాలనపై తహసీల్దార్లు పట్టు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. తద్వారా ప్రజలు సమస్యలపై జిల్లా కేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండదని చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ శాఖ పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో 4,400 పెండింగ్ దరఖాస్తులకు గాను 2,400 దరఖాస్తులకు కావాల్సిన సమాచారాన్ని వెంటనే అందజేయాలని సూచించారు. అలాగే, మండల కేంద్రాల్లో ప్రజావాణిపై విస్తృత ప్రచారం చేస్తూ జిల్లా కేంద్రానికి దరఖాస్తుదారులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. గురుకుల పాఠశాలల సందర్శన సందర్భంగా బియ్యం, సామగ్రి నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఈక్రమాన నోటీసులు సైతం జారీ చేయాల్సిన పనిలేదన్నారు. అలాగే, సీఎం, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే దరఖాస్తులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈసమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అడవుల పెంపకంపై దృష్టి..

అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్లించగా, ప్రత్యామ్నాయంగా కేటాయించిన భూముల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అటవీ, రెవెన్యూ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1,500 హెక్టార్ల అటవీ భూమిని వివిధ ప్రాజెక్టులకు కేటాయించినట్లు తెలిపారు. ఇందుకు పరిహారం ఇతర భూమిని గుర్తించినందున విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. అటవీ భూమిని అసైన్డ్ పట్టాలుగా పంపిణీ చేసిన మిగిలిన భూములను గుర్తించాలని, సమస్యలను అటవీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే, పోడు భూముల్లో పంట కోతల తర్వాత వరి కొయ్యలు, పంట అవశేషాలు తగులబెడితే అడవులకు నష్టం ఎదురవుతున్నందున అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీపీఓ ఆశాలత, ఆర్డీఓ నర్సింహారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి క్షమాపణ చెప్పాలి..



అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, నాయకులు

- అంబేద్కర్‌ను అవమానించడం గర్హనీయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సత్తుపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో గురువారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దళితులకే కాక అందరి హక్కులను కాపాడేందుకు పోరాడారని తెలిపారు. ప్రజల హక్కుల సాధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడిని అవమానించేలా అమిత్‌షా వ్యాఖ్యలు చేస్తే ప్రధాని నరేంద్రమోదీ సమర్థించడం గర్హనీయమని పేర్కొన్నారు.

ముగిసిన జిల్లా మహాసభలు

సత్తుపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సభల్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనుల్లో అభద్రతా భావం పెరిగిందన్నారు. మతం పేరుతో ప్రజలను వర్గీకరిస్తూ మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కాగా, కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ఉన్న నేపథ్యాన ప్రజల సమస్యల పరిష్కారానికి శ్రేణులు పోరాటాలు చేయాలని సూచించారు. నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఎర్రా శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, పి.నాగరాజు, వై.విక్రం, మోరంపూడి పాండు రంగారావు, నాయుడు వెంకటేశ్వరరావు, జాజిరి జ్యోతి, కొలిక పోగు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మహాసభల్లో చివరిరోజు పలు తీర్మానాలపై చర్చించి ఆమోదించారు.

జిల్లా కార్యదర్శిగా మరోమారు 'నున్నా'



సీపీఎం జిల్లా నూతన కమిటీని మహాసభల్లో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు మరోమారు ఎన్నికయ్యారు. అలాగే, కార్యదర్శివర్గ సభ్యులుగా ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, కల్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, భూక్యా వీరభద్రం, యనమదల విక్రం, బొంతు రాంబాబు, బండి పద్మ, ఎర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్ ఎన్నిక కాగా 42మందిని జిల్లా కమిటీ సభ్యులుగా నియమించారు.

మేళవింపుతోనే మేలు..

- ఆధ్యాత్మిక, ఆదివాసీ సంస్కృతుల కలబోతకు కసరత్తు
- మ్యూజియం ప్రాంగణంలో 'గిరిజన పల్లె'
- ఆదివాసీ వంటకాలతో పర్యాటకులకు స్వాగతం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రత్యేక చొరవ



ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారాముల దర్శనానికి వచ్చే వివిధ ప్రాంతాల భక్తులకు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేలా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి కార్యాచరణ రూపొందించారు. ఈమేరకు చకచకా పనులు జరుగుతున్నాయి. ఇదే సమయాన అభివృద్ధిలో ఆధ్యాత్మిక, గిరిజన సంస్కృతిని మేళవించాలని పలువురు కోరుతున్నారు.

ప్రచారం.. ప్రయాణం

భద్రాచలం చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నా సరైన ప్రచారం, రవాణా సౌకర్యాలు లేక అవి ఆదరణ కోల్పోతున్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న గిరిజన పల్లె కూడా వాటి సరసన చేరకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఉదాహరణకు సీతారాముల దర్శనం తర్వాత పాపికొండలు టూర్‌కి వెళ్లాలనుకునే భక్తులకు ఆలయం వెలుపల గిరిజన సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఉన్నాయి. ఇక్కడ పాపికొండలు టూర్‌కు బోట్ టికెట్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అవసరమైతే ఈ సొసైటీ ద్వారానే అదనపు చార్జీలతో రవాణా సౌకర్యం కూడా కల్పిస్తారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న గిరిజన పల్లెకు ఆలయ పరిసర ప్రాంగణంలో ప్రచారం కల్పించాలి. గిరిజన పల్లెకు వెళ్లేందుకు వాహనాలు (ప్రీ పెయిడ్ ట్యాక్సీ) అందుబాటులో ఉంచాలి. ఒకసారి భక్తులు, పర్యాటకులు గిరిజన పల్లెకు రావడం మొదలై, సానుకూల జన వాక్కు బలపడితే ఆ తర్వాత ప్రత్యేక ఏర్పాట్లు లేకపోయినా పర్యాటకుల రాకకు ఢోకా ఉండదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక దృష్టి పెట్టిన కలెక్టర్..

పర్యాటక పరంగా భద్రాచలం అభివృద్ధితో పాటు ఇక్కడి గిరిజన సంస్కృతికి ప్రాచుర్యం కల్పించడంపై కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో వివిధ యూనివర్సిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఇక్కడికి ఆహ్వానించారు. పంచతంత్ర స్టూడియో, రైస్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధులచే డాక్యుమెంటరీ చిత్రీకరించారు. మరోవైపు బలవర్థకమైన ఆదివాసీ వంటకాలను పర్యాటకులకు, భక్తులకు పరిచయం చేసేలా ప్రచారం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం పర్యటనకు వచ్చే వీఐపీలందరికీ ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మహిళలు తయారు చేయించిన వంటకాలను రుచి చూపిస్తున్నారు.

థీమాటిక్ క్యాంపెయిన్

భద్రాచలం పట్టణం ఓ వైపు ఆధ్యాత్మిక కేంద్రంగా ఉంటూనే మరోవైపు ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉన్న ఆదివాసీ గిరిజన సంస్కృతులకు కేంద్రంగా ఉంది. దీనికి తగ్గట్టుగా ప్రస్తుతం భద్రాచలంలో జరుగుతున్న పనులకు రాజస్థాన్‌లోని జైపూర్ తరహాలో థీమాటిక్ క్యాంపెయిన్ జోడిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గోదావరి వంతెన తర్వాత చెక్‌పోస్టు నుంచి అంబేద్కర్ సెంటర్, రాజీవ్ సెంటర్, తాతగుడి సెంటర్, బ్రాహ్మణబజార్‌లతో పాటు ఫైర్ స్టేషన్ నుంచి సబ్ కలెక్టర్ ఆఫీస్ మీదుగా ఆలయం వరకు ఉన్న ప్రాంగణాల్లో రామాయణం థీమ్‌తో పెయింటింగ్, కూడళ్లలో రామాయణ ఇతివృత్తం తెలిపే ప్రతిమలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఇక జూనియర్ కాలేజీ రోడ్డు నుంచి ఐటీడీఏ ప్రాంగణం, కూనవరం, చర్ల రోడ్లలో గిరిజన సంస్కృతి కళ్లకు కనిపించేలా సరికొత్త సొబగులు అద్దాలంటున్నారు. దీంతో పాటు ఐటీడీఏ మ్యూజియం ప్రాంగణంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆదివాసీ వస్తువులు, పరికరాలు, జీసీసీ ద్వారా సేకరించిన తేనే, స్వయం ఉపాధి ద్వారా తయారు చేస్తున్న షాంపులు, సబ్బులు, ఆహార పదార్థాలను విక్రయించాలని అంటున్నారు. తద్వారా గిరిజన ఉత్పత్తులకు ప్రచారం పెరగటంతో పాటు వారు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మ్యూజియంలో 'గిరిజన పల్లె'..



గిరిజన పల్లె వాతావరణంతో సిద్ధమవుతున్న వెదురు నిర్మాణాలు

ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియంలో 'గిరిజన పల్లె'ను తీర్చిదిద్దుతున్నారు. బిహార్ నుంచి వచ్చిన కూలీలు వెదురుతో గుడిసె, మట్టి ఇల్లు, మంచె వంటి గిరిజన ఇళ్ల నమూనా ఉండేలా నిర్మిస్తున్నారు. పర్యాటకులు వీటిలోనే కూర్చుని గిరిజన పల్లె అందాలను వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఆదివాసీ వంటకాలను పర్యాటకులకు రుచి చూపేందుకు ప్రత్యేకంగా ఇదే ప్రాంగణంలో కుటీర నిర్మాణానికి బడ్జెట్ కేటాయించారు. ఈ పనులన్నీ జనవరి 9, 10వ తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ముక్కోటి నాటికి పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

లక్ష్యం దిశగా రుణపంపిణీ

- జిల్లాలో ఎస్‌హెచ్‌జీలకు 65 శాతం మేర రుణాలు
- ఇప్పటివరకు రూ.720 కోట్లు అందజేత
- సొంత వ్యాపారాలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న మహిళలు



ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల (గ్రూపు(ఎస్‌హెచ్‌జీ)ల్లోని సభ్యులకు అందించే బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో 65 శాతం మేర పూర్తయింది. సొంత వ్యాపారం ద్వారా జీవనోపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడిన మహిళలకు రుణాలు పంపిణీ చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో 100 రోజుల గడువు ఉండగానే లక్ష్యంలో దాదాపు 65 శాతం మేర పూర్తిచేశారు. మిగిలిన లక్ష్యాన్ని మూడు నెలల్లో అధిగమించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు అత్యధిక నిధులను కేటాయించింది. మొత్తం 21,348 సంఘాలకు రూ.111.33 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలను అందించాలని లక్ష్యంగా నిర్దేశించగా అధికారులు నెలవారీ ప్రణాళిక రూపొందించుకుని బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలు మంజూరు చేయిస్తున్నారు.

తొలుత అలస్యమైనా...

2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ చకచకా సాగుతోంది. ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోరుణాల మంజూరులో కొంత జాప్యం జరిగింది. బ్యాంకుల నుంచి నగదు విడుదల, క్షేత్ర స్థాయిలో సిబ్బంది మహిళలను రుణాలు తీసుకునేలా ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు మందకొడిగా సాగాయి. కానీ గత మూడు నెలల నుంచి జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో వేగం పుంజుకుంది. మండల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఇప్పటి వరకు 7,459 సంఘాలకు రూ.720.43 కోట్ల మేర రుణాలు పంపిణీ చేశారు.

పెరిగిన లక్ష్యం

మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా అందించే రుణ పరిమితిని ప్రభుత్వం పెంచింది. దీనికి అనుగుణంగా జిల్లాలోనూ రుణ లక్ష్యాన్ని భారీగా పెంచి మహిళలకు అందజేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో రూ.1228.71 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఆ తర్వాత ఖమ్మంకు అత్యధిక లక్ష్యాన్ని కేటాయించారు. రెండేళ్ల క్రితం జిల్లాలోని మహిళా సంఘాలకు కు రూ.900 కోట్లు మాత్రమే రుణాలు ఇవ్వగా.. ఈ రెండేళ్లలో మరో రూ.200 కోట్లు అదనంగా కేటాయించడంతో మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అవకాశం లభించింది.

సద్వినియోగం చేసుకుంటున్న సంఘాలు

ప్రభుత్వం అందజేస్తున్న బ్యాంక్ లింకేజీ రుణాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో రుణాలు తీసుకున్న సంఘాలు సకాలంలో చెల్లిస్తుండగా బ్యాంకర్లు కూడా రుణపరిమితి పెంచుతున్నారు. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులు తీసుకుంటున్న రుణాలతో వ్యాపారాలు చేస్తూ నెలనెలా సక్రమంగా కిస్తీలే కాకుండా పొదుపు నగదు చెల్లిస్తున్నారు. ఈ రుణాలతో టైలరింగ్, డెయిరీ ఫామ్, కిరాణం, చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. తద్వారా కుటుంబ పోషణలో పాలుపంచుకుంటూనే ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఈక్రమంలోనే మహిళలను మరింత ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రుణలక్ష్యాన్ని పెంచారు. ఈనేపథ్యాన మార్చి నాటికి రూ.392.88 కోట్లు పంపిణీ చేసి లక్ష్యం పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

క్లుప్తంగా

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర, బోనస్



కామేపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. కామేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యాన కామేపల్లి, కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను గురువారం పరిశీలించిన ఆయన రైతులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ధాన్యాన్ని తూర్పార పట్టి నిర్దేశిత తేమతో తీసుకొస్తే మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి బోనస్ అందుతుందని తెలిపారు. ఈనేపథ్యాన గ్రామాల్లో వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని చెప్పారు. అనంతరం తేమ పరీక్షలు, కాంటాలు, మిల్లులకు తరలింపుపై సిబ్బందికి సూచనలు చేశారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓలు భూక్యా తారాదేవి, కిషోర్‌బాబు, ఏఈఓ శ్రీకన్య, రైతులు అజ్మీరా చిన్న, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి జూనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపికకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా 210మంది క్రీడాకారులు హాజరుకాగా ప్రతిభ కనబరిచిన వారితో జట్టును ఎంపిక చేశామని కబడ్డీ అసోసియేషన్ జిల్ల కార్యదర్శి కె.క్రిస్టోఫర్ బాబు తెలిపారు. ఈమేరకు పోటీలను సీనియర్ క్రీడాకారులు పర్యవేక్షించారు.

బంజారా ప్రతినిధులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న రాములునాయక్

ఖమ్మం మామిళ్లగూడెం: బంజారా ప్రతినిధులకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు సపావత్ రాములునాయక్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బంజారా భవన్‌లో గురువారం జరిగిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా కమిటీ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలన్నారు. అలాగే, జనాభా దామాషా ఆధారంగా మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలన్నారు. సంఘ్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు అమర్‌సింగ్ పవార్, కిషన్ సింగ్, జర్పుల భీముడునాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాజేష్‌నాయక్, దశరథ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో రైతుల్లో వణుకు

కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. తుపాన్ ప్రభావం ఎన్ని రోజులు ఉంటుందో తెలియకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఓవైపు చలితో ఇబ్బంది పడుతుండగా, ప్రస్తుతం జల్లులు కురుస్తుండగా ధాన్యం, పత్తిని కాపాడుకోవడంపై దృష్టి సారించారు. కొన్నిచోట్ల వరిధాన్యాన్ని కల్లాల్లో, ఇంకొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోశారు. తుపాన్ నేపథ్యాన ధాన్యం రాశులపై పట్టాలు కప్పిరాత్రిళ్లు కాపాలా ఉంటున్నారు. ఇక పత్తి కూడా చివరి తీతలో ఉండగా ఇప్పుడు వర్షం కురిస్తే రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు నాలుగు దశల్లో పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన సన్నద్ధతపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నాలుగు సార్లు పరీక్షలు నిర్వహించాలని డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 2వ తేదీ నుంచి నాలుగు దశల్లో ఈ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ యజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 8నుంచి 10వ తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ టాలెంట్ టెస్టులు నిర్వహించాలని ఆయన మరో ప్రకటనలో ఆదేశించారు. పాఠశాల స్థాయిలో ఈనెల 20న, మండల స్థాయిలో జనవరి 3న, జిల్లా స్థాయిలో జనవరి 18వ తేదీన పరీక్షలు నిర్వహించనుండగా, కోఆర్డినేటర్ సీఎంఓ రవికుమార్ వ్యవహరించనున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	15,500	7,200
ఏసీ మిర్చి	16,500	6,500
పత్తి	7,100	5,500

– ఖమ్మం వ్యవసాయం

కాలం చెల్లిన 'కల్యాణలక్ష్మి'!

చెక్కులను తిరస్కరించిన బ్యాంకర్లు



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు, నాయకులు

సత్తుపల్లి: మూడు నెలల క్రితం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేయకుండా పక్కన పెట్టడమేకాక గడువు తీరనున్న చివరి రోజు ఇవ్వడంతో వాటిని బ్యాంకర్లు తిరస్కరించిన ఘటన ఇది. సత్తుపల్లి మండలంలోని 13మందికి రూ.1,00,116 చొప్పున కల్యాణలక్ష్మి చెక్కులు సెప్టెంబర్ 19వ తేదీతో జారీ అయ్యాయి. ఏ కారణమో తెలియదు కానీ వీటిని ఇన్నాళ్లు పంపిణీ చేయలేదు. ఇక 90రోజులు కావొస్తుండడంతో గడువు ముగియనున్న గురువారం లబ్ధిదారులను పిలిపించి సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందచేసి చేతులు దులుపుకున్నారు. కాగా, చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు బ్యాంకుల్లో జమ చేసేందుకు వెళ్లగా తిరస్కరించారు. ఈవిషయమై తహసీల్దార్ యోగేశ్వరరావును వివరణ కోరగా చెక్కులను ప్రభుత్వానికి పంపించి తిరిగి తెప్పిస్తామని, ఇందులో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పారు. కానీ చెక్కులు రాగానే ఇస్తే తమకు లబ్ధి జరిగేదని, ఇప్పుడు ప్రభుత్వానికి పంపించి మళ్లీ తెప్పించే వరకు ఎన్ని రోజులు పడుతుందోనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగి హైమావతి ఇటీవల మృతి చెందగా ఆమెకు నివాళిగా సహచర ఉద్యోగులు గురువారం రాత్రి ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య, జిల్లా అధ్యక్షుడు మహబూబ్ పాషా మాట్లాడుతూ పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో మానసిక ఒత్తిడికి గురైన హైమావతి గుండెపోటుతో మృతి చెందిందన్నారు. ఆమె కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంతేకాక ఎస్ఎస్ఏ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. ఖమ్మంలోని టీటీడీసీ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగగా, కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల దీక్ష శిబిరానికి ఉద్యోగ, పెన్షనర్ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమాల్లో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి బెల్లంకొండ రాంబాబు పాల్గొన్నారు.

మాకు పాఠాలు చెప్పించండి సార్..

కామేపల్లి: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి తమకు బోధన మొదలయ్యేలా చూడాలని కామేపల్లి కేజీబీవీ విద్యార్థులు కోరారు. ఈ మేరకు పాతలింగాలలోని కేజీబీవీలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. విద్యాబోధన జరగక తాము ఇబ్బంది పడుతున్నందున ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

ఎస్‌హెచ్‌జీలకు రుణాల మంజూరుతో వ్యాపారాభివృద్ధి



బ్యాంక్ లింకేజీ రుణాల సావనీర్ విడుదల చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన మహిళలను ప్రోత్సహించేలా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెజీ)ను ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని సెర్ప్ నేషనల్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. ఖమ్మంలోని టీటీడీసీ భవనంలో గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యాంకర్లు, డీఆర్‌డీఏ డీపీఎంల సమావేశం ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి రుణాలు ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఓ పక్క మహిళలు, ఆపై సమాజం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అంతేకాక బ్యాంకర్లకూ లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు. ఈనేపథ్యాన ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈసమావేశంలోఖమ్మం డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ ఎం.డీ.నూరుద్దీన్, ఉద్యోగులు నరసింహస్వామి, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సీఎం కప్ క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆర్చరీ, నెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, జూడో, ఉషూ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 687 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహమూర్తి, పీడీలు, పీఈటీలు ఆదర్శ్‌కుమార్, పీ.వీ.రమణ, షఫీ, నగేష్, ఫణికుమార్ తదితరులు ప్రారంభించారు. కాగా, ఆర్చరీ వివిధ విభాగాల్లో టి.యోగేందర్, కె.సాయి నిఖిల్, వి.వర్ధన్, సీహెచ్.ఔచిత్య, ఎం.నిశిత, కె.నాస్సిరీనా, ఆర్.భార్గవ్, యు.అనిల్‌కుమార్, ఎస్.ఉమేష్, పి.రోసనా, డి.అశ్విమిక, ఎం.యశ్వంత్‌రెడ్డి, టి.మోఖిత్‌రెడ్డి, కె.అశ్విత్, జోషిత్‌చంద్ర విజేతలుగా నిలిచారు. ఇక బాలికల హ్యాండ్‌బాల్‌లో ఖమ్మం కార్పొరేషన్, ఇల్లెందు, బాలికల వాలీబాల్‌లో ఖమ్మం కార్పొరేషన్, కల్లూరు మండలం, ఫుట్‌బాల్ బాలురలో రఘునాథపాలెం, కూసుమంచి, బాలికల్లో రఘునాథపాలెం, ముదిగొండ, బాలబాలికల నెట్‌బాల్‌లో ఖమ్మం కార్పొరేషన్, తిరుమలాయపాలెం జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.



ఆర్చరీ పోటీల్లో విజేతలతో డీవైఎస్ఓ, అధికారులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి...



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: భారతరత్న బాబాసాహెబ్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు గురువారం ర్యాలీగా వెళ్లి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు తక్షణమే ఆయన క్షమాపణ చెప్పడంతో పదవి నుంచి వైదొలగాలన్నారు. లేనిపక్షంలో ప్రధాని ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు బొడ్డు బొందయ్య, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పాలకుర్తి నాగేశ్వరరావు, రమేష్, సూర్యనారాయణ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లపై సన్నాహక సమావేశం



ఖమ్మంవ్యవసాయం: మిర్చి సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన అధికారులు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ ఆధ్వర్యాన అధికారులు సమీక్షించారు. మిర్చి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యాన కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకునే చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు జిల్లాతో పాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచే కాక ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు కూడా మిర్చి తీసుకొస్తారు. ఈనేపథ్యాన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై శ్రీనివాస్ సూచనలు చేశారు. ఈసందర్భంగా మిర్చి శాఖ, దడవాయిలు, హమాలీలు, దిగుమతి శాఖ ప్రతినిధులు పంట కొనుగోళ్లతో ఉత్పన్నమయ్యే సమస్యలను వివరించారు. దిగుమతి శాఖకు చెందిన ప్రతినిధులు కాంటాల సమయాన సాంకేతిక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మిర్చి కొనుగోళ్లలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో సరుకు క్రమపద్ధతిలో దించేలా పర్యవేక్షించాలని లైసెన్స్ లేని వ్యాపారులను అనుమతించొద్దని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఖమ్మం మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రేడ్–2 కార్యదర్శి సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల బాధితులకు చికిత్స



బోనకల్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మొగన్

బోనకల్: అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి సకాలంలో వైద్యసాయం అందించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ బాధ్యులు డాక్టర్ మొగన్ సూచించారు. సెంటర్ అధికారి డాక్టర్ మాలతితో కలిసి గురువారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు గోవిందాపురం, చిరునోములల్లో వెల్‌నెస్ సెంటర్లను సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారి రికార్డులను పరిశీలించడంతో పాటు అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సపై సూచనలు చేశారు. బీపీ, షుగర్ బాధితుల వివరాలను నెలవారీగా నమోదు చేయాలని తెలిపారు.

ముగిసిన విద్యార్థిని అంత్యక్రియలు



శ్రీహర్ష మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

రఘునాథపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని కోయచలకకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని చెరుకూరి శ్రీహర్ష అంత్యక్రియలను స్వగ్రామంలో గురువారం నిర్వహించారు. తండ్రి ఇరుముడికి హాజరయ్యాక వైరాలోని పాఠశాలకు మేనమామతో కలిసి బుధవారం బైక్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఆమె మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు శబరిమల వెళ్తుండగా అందిన సమాచారంతో ఆమె తండ్రి వీరబాబు వెనుదిరగగా స్వగ్రామంలో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి నడుమ శ్రీహర్ష అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులంతా అంత్యక్రియలకు హాజరై ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, విద్యార్థిని మృతదేహం వద్ద మార్కెట్ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులుతో పాటు మానుకొండ రాధాకిషోర్, యరగర్ల హన్మంతరావు, వాంకుడోత్ దీప్లానాయక్ తదితరులు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్‌లో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. శాంతినగర్ వద్ద రోడ్డు దాటుతున్న తాళ్లూరి సురేష్(38)ను ఖమ్మం వైపు నుండి తల్లాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట సమీపాన ఎంఎస్‌ఆర్ క్రషర్ మిల్లు డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మజ్దూర్‌నగర్‌కు చెందిన బలేంద్ర విశ్వకర్మ(28) క్రషర్ మిల్లులో కొద్దినెలలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన ఆయన సమీపంలోని వేప చెట్టుకు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన కార్మికులు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు. కాగా, ఆయన ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని గుర్తించారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత..

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంకు చెందిన వివాహిత జి.గౌతమి(32) ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు... కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న గౌతమి మందులు వాడుతున్నా ఫలితం కనిపించలేదు. దీంతో ఈనెల 14న ఎలుకల మందు తాగిన ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఘటనపై ఆమె తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి...

సత్తుపల్లిరూరల్: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గౌరిగూడెంకు చెందిన వనమారెడ్డి బాలకృష్ణారెడ్డి (36) ఈనెల 16న రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కటుంబసభ్యులు సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స చేస్తుండగానే పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య శిల్ప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై సత్తుపల్లి ఎస్సై టి.కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, బాలకృష్ణారెడ్డి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- బైపాస్‌లో ప్రమాదానికి గురైన లారీని తొలగించని వైనం
- అదే లారీని మరొకటి ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి



రహదారి మధ్యలో నుంచి తొలగించని లారీ



లారీని ఢీకొట్టడంతో ఛిద్రమైన ఇనుప లోడ్ వాహనం క్యాబిన్

ఖమ్మంక్రైం: ప్రమాదానికి కారణమైన లారీని రహదారి మధ్యలోనే నిలపగా 18గంటలు దాటినా తొలగించకపోవడంతో అదే దారిలో వెళ్తున్న ఇంకో లారీ ఢీకొట్టగా డ్రైవర్ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం బైపాస్ రోడ్డులో కొత్త బస్టాండ్ సమీపాన బుధవారం రాత్రి లారీ కారణంగా ప్రమాదం జరగగా వాహనం నిలిచిపోయింది. ఈ లారీని గురువారం సాయంత్రం వరకు కూడా తీయించలేదు. ఇక వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు ఐరన్‌లోడ్‌తో వెళ్తున్న వాహనం డ్రైవర్ గురువారం ఈ లారీని ఢీకొట్టడంతో క్యాబిన్ ఛిద్రమై అందులో ఇరుక్కుపోయి మృతి చెందాడు. దీంతో సీఐ బాలకృష్ణ సహా ట్రాఫిక్ పోలీసులు చేరుకుని జేసీబీ సాయంతో లారీలను విడదీసి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈమేరకు పోలీసులకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు సహకరించారు. ఈక్రమాన బైపాస్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోగా ట్రాఫిక్ పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, మృతుడిని ఖమ్మం పాండురంగాపురానికి చెందిన జమాలుద్దీన్(48)గా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

వరుస ప్రమాదాలు

బైపాస్ రోడ్డులో ఇటీవల ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. డివైడర్లు సరిగ్గా లేకపోవడం, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ కరువవడంతో భారీ వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రతిరోజు ఎక్కడో ఓ చోట ప్రమాదం జరగడం సాధారణమైపోయింది. ఈ విషయమై ఇటీవలే 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అయినా స్పందించకపోగా ఇప్పుడు ప్రమాదానికి కారణమైన లారీని 24గంటల తొలగించకుండా వదిలేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.